క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సమాజంలో హెచ్ఐవీ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి డైరెక్టర్ మోగులూరి ఎలీషా అన్నారు. గ్రేస్ మినిస్ట్రీస్ చర్చిలో హెచ్ఐవీ బాధిత 15 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, బియ్యం ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ రహిత సమాజం కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలన్నారు. వ్యాధిగ్రస్తులకు మానసిక స్థైర్యం కల్పించి అందరితో పాటు సమానంగా ఆదరించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సుమలత, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జాకీర్ హుస్సేన్ కళాశాల చైర్మన్ ఆషీఫ్‌పాషా అన్నారు. కేంద్ర యువజన కేంద్ర మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం జాకీర్‌హుస్సేన్ కళాశాలలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్ ఓటుపై ఆధారపడి ఉందని తెలిపారు. ఓటు హక్కుతో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. అంతకు ముందు విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కరస్పాండెంట్ నజీబ్‌బాషా, ప్రిన్సిపాల్ జాఫర్‌సాధిక్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడామంత్రిత్వశాఖ, ఎన్టీఆర్ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో అమ్మిరెడ్డిగూడెంలో తిరువూరు బ్లాక్ లెవల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. స్థానిక ఏబీఎం హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్‌రేస్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. హైస్కూల్ హెచ్‌ఎం విజయకుమారి, సర్పంచ్ బజ్జూరి చంద్రశేఖరరావు, ఎంపీటీసీ సభ్యులు తమ్మారపు శంకర్, సొసైటీ అధ్యక్షులు గువ్వల సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, ఎన్టీఆర్ యువకేంద్రం వలంటీర్లు ఎం.అభిషేక్, బీ అశోక్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మైలవరం: ప్రెస్ క్లబ్ ఆఫ్ మైలవరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ మైలవరం సర్వసభ్య సమావేశం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశంలో నూతన అధ్యక్షుడిగా యూ.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా చిలుకూరు రాజా రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా పగడాల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మట్టా రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మన్నే శ్రీనివాస్ కోశాధికారిగా వైడీపీ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా బుద్దారపు వెంకట్రావు, వై.వీ.కృష్ణప్రసాద్, కోయ శివరామకృష్ణ, బి.బాలబాబు, కేఎస్‌బీడీ ప్రసాద్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పీ మురళీబాబు, జీ ప్రసాద్‌రెడ్డి, ఎంవీ సుబ్బారావు, పసుపులేటి చైతన్య, చండి నాగప్రసాద్, డొంకెన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వేంకటాచల స్వామి కల్యాణం



తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. జైబావి సెంటరులోని కొఠాయి మండపం వద్ద స్వామివారికి ఎదురుకోలు ఉత్సవాన్ని జరిపిన అర్చకులు మేళతాళాలతో వేంకటాచలస్వామిని ఆలయానికి గరుడవాహనంపై తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో దివి ఉదయ కుమారాచార్యులు, దేవయాజనం సత్యనారాయణాచార్యులు, వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. సీఐ అబ్దుల్ నబీ, ఎస్‌ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేంకటాచలస్వామి కల్యాణం సందర్భంగా తిరువూరు తిరునాళ్ల సందడిగా సాగింది.

అభివృద్ధి, సంక్షేమంతో వైఎస్సార్ సీపీ విజయం

ఎంపీ కేశినేని నాని



ఆత్మీయ సమావేశంలో తిరుపతిరావును పరిచయం చేస్తున్న ఎంపీ కేశినేని నాని

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ఎంపీ కేశినేని నాని అన్నారు. ఇబ్రహీంపట్నంలో మండల వైఎస్సార్ సీపీ నాయకుల ఆత్మీయ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావుతో కలిసి ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1.60 కోట్ల కుటుంబాలు ఉంటే 1.35 కోట్ల కుటుంబాలకు రూ.2.55 లక్షల కోట్లు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి దక్కిందన్నారు. చంద్రబాబు రైతుల నుంచి 33 వేల ఎకరాలు సేకరించి తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నిర్మించి రైతులను మోసం చేశాడని, సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా రూ.30 వేల కోట్లతో 1100 సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు శాశ్వత ఆస్తులుగా గ్రామాల్లో నిర్మించి దేశానికి ఆదర్శంగా నిలిపారని తెలిపారు. వాటిల్లో 4 లక్షల మందికి ఉద్యోగాలు, వలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు రక్షణగా ఉంచారని కొనియాడారు. 8,500 కోట్లతో మెడికల్ కళాశాలల నిర్మాణం, పోర్టుల నిర్మాణంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. 2014లో చంద్రబాబును ప్రజలు గెలిపిస్తే డ్వాక్రా, రైతు రుణాలు రద్దు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి వంటివి చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు ఆయన నమ్ముకున్న వారికోసమే పనిచేస్తారని ఎద్దేవా చేశారు. మైలవరంలో 25 వేల మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం ఖాయన్నారు. జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జి తిరుపతిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పనిచేసిన నన్ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారని తెలిపారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని అన్నల ప్రోత్సాహంతో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గంలో పార్టీ విజయానికి నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. పలువురు నాయకులు పార్టీని, నాయకులను మోసం చేసిన వసంత కృష్ణప్రసాద్‌పై విమర్శల వర్షం కురిపించారు. డబ్బు సంచులతో వస్తానంటున్న వసంత కృష్ణప్రసాద్‌ను ఓడిస్తామని ప్రకటించారు. మండల, కొండపల్లి మున్సిపాల్టీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంత సాంబశివరావు, మిక్కిలి శరభయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మునగాల శివారెడ్డి, మేడపాటి నాగిరెడ్డి, వివిధ విభాగాలకు చెందిన నాయకులు నిడుముక్కల శివశంకరరావు, జోగి రాము, గుంజా శ్రీనివాస్, లంకే అంకమోహనరావు, పోరంకి పద్మావతి, కాండ్రకొండ గురవయ్య, నల్లమోతు బోస్, చింకా శ్రీనివాసరావు, శివరామ్‌ప్రసాద్, గరికపాటి రాంబాబు, కోమటి కోటేశ్వరరావు, నల్లమోతు సుభాష్, బాణావత్ నాగబాలమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవినేని ఉమాకు మొండిచేయి

వసంతకు రూట్ క్లియర్

జి.కొండూరు: ప్రస్తుతం మైలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్న దేవినేని ఉమామహేశ్వరరావు ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబును కలిసిన అనంతరం వసంత వెంకటకృష్ణప్రసాద్ టీడీపీలో చేరికకు రూట్ క్లియర్ అయినట్లు తెలిసింది. మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా రెండవసారి అవకాశం లేకపోవడంతో టీడీపీ అభ్యర్థిత్వం కోసం వసంత వెంకటకృష్ణప్రసాద్ గత కొన్ని రోజులుగా పట్టు బడుతున్నారు. ఈ క్రమంలో వసంత రాకను వ్యతిరేకిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు, మైలవరం సీటు తనదేనంటూ నియోజకవర్గంలో గత కొన్నిరోజులుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం చంద్రబాబునాయుడిని కలిసిన అనంతరం దేవినేని ఉమామహేశ్వరరావు తలవంచారు. దీనితో వసంత వెంకటకృష్ణప్రసాద్ మైలవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా సీటు దక్కించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో వసంత వెంకటకృష్ణప్రసాద్ ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడు 'స్పందన'

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26న స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనలో ప్రజలు అర్జీలను అందజేయాలని ఆర్డీఓ కోరారు.

ముసునూరు: మండల రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జవహర్ బాజి తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్న ఈ కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అందజేయాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బాలుర హాస్టల్‌లో రాత్రి బస



బాలుర వసతి గృహంలో రాత్రి బస చేసిన సాంఘిక సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా జేడీ జయప్రకాష్

నూజివీడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో 20 రోజుల్లో ప్రారంభమవుతున్నందున విద్యార్థులు శ్రద్ధగా చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ ఏలూరు జిల్లా జేడీ వీ జయప్రకాష్ పేర్కొన్నారు. పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంను శనివారం రాత్రి జేడీ ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులతో పాఠ్యాంశాల విషయమై చర్చించారు. విద్యార్థుల ప్రగతిని ట్యూటర్లతో కలిసి పరిశీలించారు. ఇంగ్లిష్ ట్యూటర్‌తో కలిసి ఇంగ్లిష్ గ్రామర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలు దగ్గరపడుతున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. విద్యార్థులతో కలిసి జేడీ భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, వసతుల గురించి ఆరా తీశారు. వసతి గృహ సంక్షేమాధికారి పాల్గొన్నారు.

కాలి నడకన ద్వారకా తిరుమలకు..



చాట్రాయి: సూరంపాలెం గ్రామానికి చెందిన 15 మంది మహిళలు కాలినడకన మొక్కు తీర్చేందుకు ఆదివారం సాయంత్రం ద్వారకా తిరుమల బయలు దేరారు.ఈ సందర్భంగా చనుబండ గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో వారు పూజలు చేసారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీశేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో పూర్ణాహుతి

మెట్టగుట్ట(గంపలగూడెం): మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. సుప్రభాత సేవతో చివరి రోజు కార్యక్రమాలను ఆలయ అర్చకులు తూమాటి యోగానందాచార్యులు, తూమాటి శ్యామసుందరాచార్యులు, అర్చక బృందంచే ఘనంగా ప్రారంభించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చూర్ణోత్సవం, వసంతోత్సవం కోలాహలంగా జరిపారు. శ్రీచక్రస్నానం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా మౌనబలి, ధ్వజపట అవరోహణ జరిపారు. నూతన వధూవరులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవాసుని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి భక్తులు మోసుకొంటూ ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షణలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవళింపు సేవతో ప్రత్యేక కార్యక్రమాలు ముగిశాయి. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసంతర్పణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

నేడు ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ట



హోమ కార్యక్రమంలో శ్రీనివాసరావు, కరుణాకరరావు దంపతులు

కొణిజెర్ల(గంపలగూడెం): మండలంలోని కొణిజెర్ల భవానీ చంద్రశేఖర ఆలయంలో శిఖరం, ధ్వజస్తంబం ప్రతిష్టలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 10.25 గంటలకు ప్రతిష్టా కార్యక్రమాలను అర్చకులు రవికుమార్, కృష్ణమూర్తి, హరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆదివారం ధ్వజస్తంభం, శిఖరాలకు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. గుడిలో గతంతో ఉన్న ధ్వజస్తంభం తొలగించి కొత్త ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రత్యేక కార్యక్రమాల్లో ఎస్‌ఆర్‌ఐ బొల్లా శ్రీనివాసరావు, మైథిలి, వైఎస్సార్ సీపీ నాయకులు బొల్లా కరుణాకరరావు, శశికళ దంపతులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. సోమవారం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు.

సైన్స్ ఎక్స్‌పోలో వెల్లివిరిసిన సృజనాత్మకత



సైన్స్ ఎక్స్‌పోలో మోడల్స్ వివరాలను తెలుసుకుంటున్న న్యాయనిర్ణేతలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో (సైన్స్ స్పార్క్)లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టుల నమూనాల్లో సృజనాత్మకత వెల్లివిరిసింది. ఇందులో 120కి పైగా వచ్చిన మోడల్స్‌లో రోబో, చంద్రయాన్, సేవ్ ద ఎర్త్, వాల్కనో, డ్రిప్ ఇరిగేషన్, బ్లెండ్ స్పెక్టికల్స్, కిడ్నీ వర్కింగ్ మోడల్, సీడ్ జర్మినేషన్ తదితర మోడల్స్ ఉన్నాయి. శాస్త్రవేత్తల వేషధారణలో వచ్చిన ప్రీ ప్రైమరీ చిన్నారులు ఆహూతులను ఆకర్షించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య మాట్లాడుతూ సైన్స్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్.వాణి కుమారి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతోపాటు వ్యక్తిగత వికాసానికి అవసరమైన ఇటువంటి కార్యక్రమాలను ప్రతి నెలా నిర్వహిస్తున్నామని తెలిపారు. సైన్స్ ఎక్స్‌పో ప్రదర్శనకు న్యాయనిర్ణేతలుగా అన్నపూర్ణయ్య, కల్యాణి, కోటేశ్వరమ్మ వ్యవహరించారు. ఇన్‌చార్జ్‌లు బాషా, సౌందర్య, ఏట వాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న సీఐ అబ్దుల్ నబీ

తిరువూరు: విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలగాలని, చెడు నడతకు అలవాటు పడితే భవిష్యత్ అంధకారం అవుతుందని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ అన్నారు. స్థానిక నారాయణ స్కూలులో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధిస్తేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యపడుతుందని, ఏకాగ్రతతో, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పది పాసైన తర్వాత సరైన కోర్సును తమ అభిరుచికి అనుగుణంగా ఎంచుకోవాలని, తల్లిదండ్రులు సైతం పిల్లలపై ఒత్తిడి చేయవద్దని సూచించారు. తిరువూరు నారాయణ స్కూలు ప్రిన్సిపాల్ వెంకటరత్నం, ఏజీఎం హరీష్, ఆర్ఐ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల విందుగా నందదీపోత్సవం



గంపలగూడెం: స్థానిక షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయంలో శనివారం రాత్రి నందదీపోత్సవం కార్యక్రమాన్ని కనుల విందుగా జరిపారు. బాబా ఉత్సవమూర్తిని ప్రత్యేక పల్లకీలో ఉంచి భక్తులు నందదీపాలతో ఆలయం చుట్టూ 11 ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం భక్తులు పలుపాటలతో ప్రత్యేక భజన కార్యక్రమం జరిగింది. బాబాకు హారతితో ప్రత్యేక కార్యక్రమాలను ముగించారు.

మాజీ సర్పంచి మృతి

ముసునూరు: గోపవరం మాజీ సర్పంచి దొడ్డుల వీరాస్వామి (82) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 2009 నుంచి 2014 వరకు గోపవరం సర్పంచిగా ఆయన పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మండల వైస్ ఎంపీపీ పాముల గంగాధరరావు, స్థానికులు పలువురు మాజీ సర్పంచ్‌కు నివాళులర్పించారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి దాత విరాళం అందజేశారు. ఆదివారం విజయవాడలోని మొగల్రాజపురానికి చెందిన నిమ్మగడ్డ ప్రణీత్ రూ.50 వేలను విరాళంగా ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం



రాయనపాడు గ్రామంలో సర్నాల తిరుపతిరావుకు స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

రాయనపాడు(విజయవాడరూరల్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అందరం సమన్వయంతో పనిచేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం మైలవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా తొలిసారిగా విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో పార్టీ నాయకులను, కార్యకర్తలతో తిరుపతిరావు ఆదివారం సమావేశాలు నిర్వహించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు తాను ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నానని పేర్కొన్నారు. రాయనపాడు గ్రామం విచ్చేసిన ఆయనకు మండల పార్టీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్ర రావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు పార్టీ విజయానికి శ్రీరామ రక్ష అని అన్నారు. సమావేశంలో గ్రామ పార్టీ కన్వీనర్ పోలసాని వాసు, మల్లాది వెంకటేశ్వరావు, పోలసాని పాపారావు, మండవ నరసింహారావు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పైడూరుపాడు, గ్రామ సర్పంచి వేముల సీతారామయ్య, డొక్కా వెంకటరత్నం, డాక్టర్ కిషోర్, షాబాదు, జక్కంపూడి, గ్రామాల్లో పార్టీ నాయకులు వేముల సీతారామయ్య, డొక్కా వెంకటరత్నం, డాక్టర్ కిషోర్, సతీష్, షాబాదు, జక్కంపూడి గ్రామాల్లో వెంకటకృష్ణ, మధుసూదనరావు, హిమాప్రసాద్, గందం శ్రీనివాసరావు, కొత్తూరు తాడేపల్లి గ్రామ సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, పరికిల శ్రీనివాసరావు, పోతురాజు మధవరావు, కె.రాంబాబు రాజులపాటి వెంకటేశ్వరావులతో కలిసి సమావేశాలు నిర్వహించారు.

చదువుకు అవకాశాలు కల్పించాలి



మిట్టగూడెంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నూజివీడు: ఆడపిల్లలు చదువుకునేందుకు అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మిట్టగూడెంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరం ఆదివారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వలంటీర్లు బాలికల విద్య, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలు, యువత-చెడు వ్యసనాలు, సెల్‌ఫోన్‌కు బానిస అవ్వడం తదితర అంశాలపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. ఆడపిల్లకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు వయస్సు నిండే వరకు వివాహాలు చేయకూడదన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని, చదువుపైనే యువత దృష్టిని పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సజావుగా గ్రూపు-2 పరీక్ష నిర్వహణ

2,288 మంది అభ్యర్థులకు
1,839 మంది హాజరు



ఎస్ఆర్ఆర్ హైస్కూల్ పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను తనిఖీ చేసి పంపుతున్న సిబ్బంది

నూజివీడు: పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం గ్రూపు-2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు-2 పరీక్ష నిర్వహించింది. పట్టణంలో ట్రిపుల్ ఐటీ, శ్రీ సారధి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఆర్ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, శారద జూనియర్ కళాశాల, మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 10.15 గంటలకు ముందుగానే పరీక్ష కేంద్రాలకు పంపించారు. ఆ తరువాత ఎవరినీ లోపలికి అనుమతించలేదు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగింది. అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా మంచినీటి వసతిని, ఫ్యాన్లు తదితర సౌకర్యాలను కల్పించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144వ సెక్షన్‌ను అమలు చేశారు. ఏడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2,288 మంది అభ్యర్థులకు 449 మంది గైర్హాజరయ్యారు. 1,839 మంది పరీక్షకు హాజరయ్యారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి పర్యవేక్షణలో నలుగురు ఎస్సైలు, 20 మంది పోలీస్ సిబ్బంది పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

ఆంగ్లభాషను సులువుగా నేర్చుకోవచ్చు



తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రాంప్రదీప్

తిరువూరు: ప్రపంచంలో అత్యధిక దేశాల్లో వాడుకలో ఉన్న ఆంగ్ల భాషను ప్రతి విద్యార్థీ నేర్చుకోవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ సూచించారు. తిరువూరు, గానుగపాడు జెడ్పీ బాలికోన్నత పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం ఇంగ్లిషు గ్రామర్ నేర్చుకోవడంలో మెలకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భయపడకుండా ఆంగ్లం నేర్చుకుంటే అనర్గళంగా మాట్లాడవచ్చని సూచించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లిషు సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించడానికి సూచనలిచ్చారు. ఆంగ్లభాషోపాధ్యాయ సంఘ సభ్యులు జయశ్రీపద్మావతి, శారదభాను, మోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి సిలువగట్టు తిరునాళ్ల



నూజివీడు: పట్టణంలోని విజయవాడ రోడ్డులో సిలువ గట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్ల నేటి నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ తిరునాళ్ల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సిలువగట్టు పుణ్యక్షేత్రం రెక్టార్ రెవరండ్ ఫాదర్ గొర్రెముచ్చు జోసఫ్ పర్యవేక్షణలో సిలువ గట్టు కమిటీ సభ్యులు, పెద్దలు ఏర్పాట్లు చేశారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో ఇక్కడ ప్రత్యేక పూజలు, దివ్యబలి పూజ, ప్రార్థనలు నిర్వహించనున్నారు. పెద్ద ఎత్తున వచ్చే క్రైస్తవులకు ఇబ్బందులు లేకుండా రహదారికి మరమ్మతులు చేయడంతో పాటు వాహనాలకు పార్కింగ్‌కు సౌకర్యం కల్పించారు. రహదారికి ఇరువైపులా రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు. గట్టుపైకి ఎక్కి సిలువును దర్శించుకునేందుకు వీలుగా గట్టుచుట్టూ ఉన్న రహదారిని అభివృద్ధి చేశారు. భక్తులు పుణ్యక్షేత్రాన్ని సందర్శించి ప్రభువు దీవెనలను పొందాలని ఫాదర్ జోసఫ్ విజ్ఞప్తి చేశారు. పలు వినోద కార్యక్రమాల ఏర్పాట్లు సైతం చేస్తున్నారు. ప్రతిరోజూ సిలువ ప్రార్థనలు, ప్రసంగాలు, సిలువ తేరు ప్రదక్షిణ, దివ్య ఆరాధన, దివ్యబలి పూజ నిర్వహిస్తారు. ఆఖరిరోజున సాయంత్రం విజయవాడ పీఠాధిపతి ఆధ్వర్యంలో దివ్యబలి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. మూడురోజుల తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా పోలీసు అధికారులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



తిరువూరు: స్థానిక శ్రీకోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు సోమవరపు సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులు సీతారాముల శాంతికల్యాణాన్ని జరిపారు. హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణ తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.